క్లుప్తంగా

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ


హాసిని


ఎండీ హాఫీజ్

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన హాసిని మంగళవారం సాయంత్రం వెలువడిన నీట్ ఫలితాల్లో 720 మార్కులకు గాను 531 మార్కులు సాధించింది. దీంతో విద్యార్థిని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు అభినందించారు. హాసిని 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కల్వకుర్తిలోని అరబిందో హైస్కూల్, 6వ తరగతి కేంద్రీయ నవోదయ విద్యాలయం వట్టెంలో, ఇంటర్మీడియట్ హైదరాబాదులోని శ్రీచైతన్య ఏసీ క్యాంపస్ నాగోల్ విద్యను అభ్యసించింది. ఎంబీబీఎస్ ప్రవేశ పరీక్షకు అర్హత సాధించిచడంతో గ్రామస్తులు అభినందించారు.

దోమలపెంట: నీట్ ఫలితాల్లో దోమలపెంటకు చెందిన విద్యార్థి ఎండీ హాఫీజ్ బాబా 720 మార్కులకు గాను 559 మార్కులు సాధించి ఎంబీబీఎస్ ప్రవేశానికి అర్హత సాధించాడు. ఎంపీటీసీ మల్లిఖార్జున విద్యార్థి హాఫీజ్‌బాబాను అభినందించి సన్మానించారు.

రామన్‌పాడు పైపు లైన్ లీకేజీ



తాడూరు: మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీల కారణంగా మూడు రోజులుగా నీటి సరఫరా లేక మండల కేంద్రంతో పాటు గుంతకోడూరు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం తాడూరు సమీపాన మిషన్ భగీరథ పైప్ లైన్ గేట్‌వాల్వ్ నుంచి లీకవుతోంది. ఫౌంటేన్ మాదిరిగా నీరు లీకవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వృథా అవుతున్న నీటిని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తపాలా శాఖలో గ్రేడ్-1 పోస్టుమాస్టర్ల బదిలీలు

ఖమ్మంగాంధీ చౌక్: రాష్ట్రంలోని ఐదు హెడ్ పోస్టాఫీసుల్లో పనిచేసే హయ్యర్ సెలక్షన్ గ్రేడ్-1(హెచ్‌ఎస్‌జీ-1) పోస్టుమాస్టర్లను బదిలీ చేస్తూ హైదరాబాద్ ప్రాంతీయ పోస్టుమాస్టర్ జనరల్ సుమిత అయోధ్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ హెచ్‌ఎస్‌జీ గ్రేడ్-1 పోస్టుమాస్టర్ కె.కిరణ్‌కుమార్‌రెడ్డిని వరంగల్ హెడ్ పోస్టాఫీసుకు బదిలీ చేశారు. అలాగే, హన్మకొండ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్ కె.సుబ్రమణ్యంను ఖమ్మంకు, హన్మకొండ హెడ్ పోస్టాఫీస్‌లో డీపీఎం(ఎస్‌బీ) పోస్టుమాస్టర్ ఎం.సురేష్‌బాబును మహబూబ్‌నగర్ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్‌గా, కరీంనగర్ హెడ్ పోస్టాఫీస్ డీపీఎం(ఎస్‌బీ) పోస్టుమాస్టర్ కేవీ.పవన్‌కుమార్‌ను హన్మకొండ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్‌గా, వరంగల్ హెడ్ పోస్టాఫీస్ డీపీఎం (మెయిల్స్) పోస్టుమాస్టర్ ఏ.తిరుపతిని కరీంనగర్ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదిలా ఉండగా మరో ఇద్దరు పోస్టుమాస్టర్లకు హయ్యర్ సెలక్షన్ గ్రేడ్-1 పోస్టుమాస్టర్లుగా(హెచ్‌ఎస్‌జీ-1) పదోన్నతి కల్పించడమే కాక బదిలీ చేశారు. నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లో పోస్టుమాస్టర్లు(హెచ్‌ఎస్‌జీ-2)గా పనిచేస్తున్న జి.గంగాధర్‌కు హెచ్‌ఎస్‌జీ-1గా ఉద్యోగోన్నతి కల్పించి ఆదిలాబాద్ హెడ్ పోస్టాఫీస్‌కు, కె.అజయ్‌కుమార్‌ను నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లోనే హెచ్‌ఎస్‌జీ-1గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించండి



పెద్దకొత్తపల్లి: హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు అవసరమైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని డీఆర్డీఓ ఓబులేష్ అన్నారు. మంగళవారం పెద్దకొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్డీఓ మాట్లాడుతూ నర్సరీల్లో అన్నిరకాల మొక్కలను హరితహారం కార్యక్రమానికి సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు ప్రభుత్వ స్థలాలను గుర్తించి, నివేదిక సమర్పించాలని సూచించారు. గ్రామాల్లో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తిచేయాలని ఆదేశించారు. గ్రామాల రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వించాలని సూచించారు. ఈఏడాది మండలంలోని 25 గ్రామపంచాయతీలలో 150 మంది రైతుల పొలాల్లో పాంపండ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. 50 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి చర్యలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నాగేందర్, ఉపాధి హామీ సీసీ రామ్మోహన్‌రెడ్డి, టీఏ మణిరాం, మహేందర్, శీనయ్య ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు


నాగర్‌కర్నూల్‌లో ఎంపీ మల్లు రవికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు


చారకొండ మండలం జూపల్లిలో

సాక్షి, నెట్‌వర్క్: కల్వకుర్తి పట్టణంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి తోటపల్లి రాజేష్ రెడ్డి, ఎల్లికల్ మాజీ ఎంపీటీసీ రామకృష్ణలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మల్లురవిని ఆశీర్వదించిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

■ తిమ్మాజిపేట, బిజినేపల్లి మండల కేంద్రాల్లో ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా కాల్చి స్వీట్లు తినిపించుకున్నారు.

■ పెంట్లవెల్లిలోని మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్, కొండూరు తదితర గ్రామాలలో కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు.

■ వెల్దండ మండల కేంద్రంలో మంగళవారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురవి ఘన విజయం సాధించడంతో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు.

■ నాగర్‌కర్నూల్ ఎంపీగా ఎన్నికైన డాక్టర్ మల్లు రవిని మన్ననూర్‌కు చెందిన జిల్లా నాయకులు వెంకటరమణ, సత్యనారాయణ, ఎంఏ రహీంలు ఎంపీగా ఎన్నికైన డాక్టర్ మల్లు రవిని నాగర్‌కర్నూల్‌లో కలిసి సన్మానించారు.

■ అచ్చంపేటలో కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చి, నినాదాలు చేశారు. నాయకులు నాసరయ్య, మహబూబ్‌అలీ, సుధాకర్, ప్రసాద్, రంజిత్, అయూబ్, జైపాల్, కిరణ్ పాల్గొన్నారు.

■ తెలకపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి నెహ్రూ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. విండో వైస్ చైర్మన్ యాదయ్య, మైనార్టీ నాయకులు కుర్షిద్, బాలరాజు, రామకృష్ణ, ప్రకాష్ పాల్గొన్నారు.

■ కొల్లాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచారు.

■ చారకొండ మండల కేంద్రంతో పాటు జూపల్లిలో ర్యాలీ నిర్వహించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటయ్య యాదవ్ హాజరయ్యారు. కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ముస్తాఫా, రామచంద్రి, వెంకటయ్య, మల్లయ్య, రాజు యాదవ్, లింగం, జంగయ్య తదితరులు ఉన్నారు.

■ లింగాల మండల కేంద్రంతో పాటు, దారారంలో కాంగ్రెస్ నాయకుడు శ్రీశైలం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.


పెంట్లవెల్లి మండలం మంచాలకట్టలో


లింగాల మండలం దారారంలో


తెలకపల్లిలో..


అచ్చంపేటలో


కొల్లాపూర్‌లో స్వీట్లు పంచుతున్న నాయకులు


వెల్దండలో..

బీజేపీ నాయకుల ర్యాలీ


జూపల్లిలో నినాదాలు చేస్తున్న నాయకులు

చారకొండ: పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో బీజేపీ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకొని, తెలంగాణలో 8 స్థానాలను దక్కించుకోవడంతో ఆ పార్టీ నాయకులు మంగళవారం మండలంలోని జూపల్లిలో నాయకులు భారీ ర్యాలీ తీశారు. అనంతరం ప్రధాన రహదారిపై బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. బీజేపీకి అనుగుణంగా నినాదాలు చేశారు. బీజేపీతోనే దేశ భద్రత సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు పర్వతాలు, కొండల్ గౌడ్, సత్యం యాదవ్, శ్రీను, గోపాల్, నరేష్, మహేష్ ,శివ తదితరులు ఉన్నారు.

బాధితురాలికి పరామర్శ


పరామర్శిస్తున్న నాయకుడు జైపాల్‌రెడ్డి

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లికి చెందిన జంగయ్య భార్య లలిత అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న సీపీఐ నాయకుడు జైపాల్‌రెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. సీఎం సహాయ నిధి ద్వార చికిత్స కోసం ఆర్థిక సహాయాన్ని అందజేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నాయకులు రామకృష్ణ, వంశీ ఉన్నారు.

వైభవంగా బోనాల వేడుకలు


బోనాలతో ర్యాలీగా వస్తున్న మహిళలు

లింగాల: మండలంలోని దారారంలో మంగళవారం గ్రామ దేవత బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం ముగింపు సందర్భంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు ఊరేగింపుగా బోనాలను కోట మైసమ్మ, మశమ్మ దేవతల ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలలో భాగంగా పూజారి గిరి మూడు రోజుల పాటు గ్రామ దేవతకు శక్తి పూజలు, జలాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కవిత, శ్రీనునాయక్, బీఆర్‌ఎస్ మండల యువజన నాయకలు అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం


క్రీడాకారులకు ట్రోఫీని అందజేస్తున్న వైస్ ఎంపీపీ భీంరెడ్డి

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో మదనగోపాలస్వామి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్‌లో పెంట్లవెల్లి, జటప్రోల్ జట్లు తలపడగా పెంట్లవెల్లి గెలుపొందింది. అనంతరం వైస్ ఎంపీపీ భీంరెడ్డి ట్రోఫీని అందజేశారు. క్రీడాకారులకు ఉజ్వల్ భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. గెలుపోటములు సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. నాగిరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రహరీ లేక పాఠకుల ఇబ్బందులు



ప్రహరీకి నోచుకోని బల్మూర్ శాఖ గ్రంథాలయం

బల్మూర్: స్థానిక శాఖ గ్రంథాలయం భవనం చుట్టు ప్రహరీ నిర్మించక పోవడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ నిర్మించకపోవడంతో ఆవరణంలో రాత్రివేళ అసాంఘీక కార్యకలాపాలకు అడ్డగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కుక్కలు పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయని దీంతో పాఠకులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయల పనుల కోసం వచ్చిన గ్రామాల ప్రజలు భవనం వెనక ప్రాంతంలో మూత్రవిసర్జన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంపువాసన భరించలేకపోతున్నామని వాపోయారు. అధికారులు, పాలకులు స్పందించి గ్రంథాలయం చుట్టు ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.

నీట్‌లో 'రిషి' విద్యార్థుల సత్తా


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న రిషి యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని రిషి అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తాచాటారు. ఈ మేరకు అకాడమీకి చెందిన అనన్య 627 మార్కులు, మౌనిక 621, సఫాన్ సాద్ 610, సంతోష్ 600 మార్కులు సాధించినట్లు అకాడమీ కరస్పాండెంట్ చంద్రకళావెంకట్ పేర్కొన్నారు. 600లకు పైగా ఐదుగురు, 550 మార్కులు 20 మంది, 500లకు పైగా 50 మంది మార్కులు సాధించినట్లు తెలియజేశారు. తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడం గర్వంగా ఉందని, ఎక్కువ సంఖ్యలో మెడికల్ సీట్లు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'వాగ్దేవి' విజయకేతనం


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజామన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వాగ్దేవి కళాశాల విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. మా విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పోటీ పడేలా తీర్చిద్దామని, ఇన్నొవేటివ్ సైంటిఫిక్ టీచింగ్ అప్రోచ్ కార్యక్రమం ద్వారా ప్రత్యేక బోధన చేశామన్నారు. కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి తల్లిదండ్రులు, జిల్లా పేరును నిలబెట్టారన్నారు. ఈ మేరకు కళాశాలకు చెందిన 30 నుంచి 45 మంది విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతాదేవి, ఐఐటీ, నీట్ అకాడమీ ఇన్‌చార్జ్ పావని, యాకుబ్, షాకీర్, శివకుమార్, రాఘవేందర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి

పెద్దకొత్తపల్లి: ఇటీవల కురిసిన వర్షానికి తిరునాంపల్లి రోడ్డుపై ఏర్పడిన గుంతలలో వర్షపు నీరు నిలిచింది. దీంతో కల్వకోలు నుంచి తిర్నాంపల్లి, వేడుకరావుపల్లి, మారేడుమాన్‌దిన్నె గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నారు. గ్రామస్తులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు


కౌంటింగ్ హాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అబ్జర్వర్లు

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని నెల్లికొండి వ్యవసాయ మార్కెట్‌యార్డు గోదాంలో మంగళవారం నిర్వహించిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతవారణంలో ముగిసింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అసౌర్యాలు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 నుంచి ప్రారంభమైన కౌంటింగ్.. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. పార్లమెంట్ పరిధిలో మొత్తం ఏడు నియోజకవర్గాలు ఉండగా.. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, వనపర్తి, కల్వకుర్తి, అలంపూర్, గద్వాల అసెంబ్లీ సెగ్మెంట్లకు సబంధించిన ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా కొనసాగింది. కౌంటింగ్ అబ్జర్వర్లు సత్పాల్ శర్మ, రుచేష్ జైవాన్షీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, అభ్యర్థుల సమక్షంలో ఉదయం 8 గంటలకు స్ట్రాంగ్‌రూం తెరిచి, ఈవీఎంలను టేబుళ్లపైకి పంపించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి సంబంధించి ముందుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కించి.. తర్వాత ఈవీఎంల ఓట్లను లెక్కించారు. ఎంపీగా విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవి.. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కలెక్టర్ ఉదయ్ కుమార్ చేతులమీదుగా ధ్రువపత్రం అందుకున్నారు.

నిరంతర పర్యవేక్షణ..

కౌంటింగ్ ప్రక్రియను కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. రౌండ్ల వారీగా ఫలితాలను పరిశీలించడంతో పాటు ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. రిటర్నింగ్ అధికారుల అనుమతితో ఎన్నికల ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు మల్లురవి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, పోతుగంటి భరత్‌ప్రసాద్ కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించారు.

పటిష్ట భద్రత..

కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. మీడియా, అనుమతి ఉన్న వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రంలోకి అనుమతించారు. ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించలేదు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. కౌంటింగ్‌లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, విలేకరులకు భోజన వసతి కల్పించారు. భోజన సమయంలో కౌంటింగ్‌కు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ఇన్‌చార్జి అధికారులు చర్యలు చేపట్టారు.


ఈవీఎంల ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది


ఈవీఎం మిషన్లు తీసుకెళ్తున్న సిబ్బంది



బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

నల్ల బెల్లం పట్టివేత: కేసు నమోదు


నల్లబెల్లం పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

కోడేరు: మండలంలోని ఓప్పి తండాలో ఎక్సైజ్ ఎస్‌ఐ హనుమంతు ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. 420 కేజీల నల్ల బెల్లం 10 కేజీల స్పటికం, 2 లీటర్ల సారా, 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది నార్యనాయక్, మంజుల తదితరులు పాల్గొన్నారు.